సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 28 । జూలై । 2023



మల్కాపూర్‌లోకి బ్యాక్ వాటర్

సాక్షి, పెద్దపల్లి: వరద ఉధృతి పెరగటంతో సుందిళ్ల బ్యారేజీ బ్యాక్‌వాటర్ మల్కాపూర్ హనుమాన్ ఆలయ పరిసరాల్లోకి వచ్చాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



జల దిగ్బంధంలో గ్రామాలు

గోదావరి, మానేరు ఉగ్రరూపం దాల్చడంతో మంథని డివిజన్‌లోని పరీవాహక ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

పలు రైళ్ల రద్దు



రామగుండంలో నిలిచిన రామేశ్వరం ఎక్స్‌ప్రెస్

రామగుండం: భారీ వర్షాలకు కాజీపేట సమీపంలోని వడ్డెపల్లి చెరువు పొంగిపొర్లి రైల్వే ట్రాక్‌ను ముంచెత్తాయి. దీంతో బల్హార్షా వైపు నడిచే రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేశారు. కాజీపేట–బల్హార్షా మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించారు. రైళ్లు రద్దు కావడంతో ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. రైళ్లలో ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కనువిందుగా రామునిగుండాల



గుండాలపైనుంచి జాలువారుతున్న వరద నీరు

రామగుండం: రామగుండంలోని రామునిగుండాలపై నుంచి వరద నీరు పడుతూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. దిగువన ఉన్న కుంట నిండి పంటపొలాల్లోకి వరద నీరు చేరుతోంది. శ్రీరామపాదక్షేత్రానికి వెళ్లే రహదారి మార్గంలో కొండచరియలు విరిగిపడి రహదారి ఆనవాళ్లు కోల్పోయింది.

బల్దియా కమిషనర్‌గా సుచరన్



కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ కమిషనర్‌గా జి.సుచరన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ సీడీఎంఏ సి.సుదర్శన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుచరన్ ప్రస్తుతం బల్దియాలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ (ఈఈ)గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు కమిషనర్‌గా పని చేసిన బి.సుమన్‌రావు ఈనెల 15న బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన సీహెచ్.నాగేశ్వర్‌ను ఇక్కడకు బదిలీ చేయగా, ఆయన విధుల్లో చేరలేదు. పరిపాలన సమస్యలు తలెత్తుతున్నాయని, అప్పటివరకు సుచరన్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించాలని ఇటీవల నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ సీడీఎంఏకు లేఖ రాశారు. స్పందించిన సీడీఎంఏ సుచరన్‌కు బాధ్యతలు అప్పగించింది.

జాతీయ విద్యావిధానంలో మార్పులు

జ్యోతినగర్: నూతన జాతీయ విద్యావిధానంలో విధానపరమైన మార్పులను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిందని ఎన్టీపీసీలోని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు విద్యార్థులను మూడు విభాగాలుగా బాలవాటికలో చదివిన తరువాత ఎల్‌కేజీ ప్రవేశం ఉంటుందని, పైలట్ ప్రాజెక్ట్‌గా 500 కేంద్రీయ విద్యాలయల్లో ప్రవేశపెట్టనున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో బట్టీపట్టే విధానం ఉండదని, ఆబ్జెక్ట్, సబ్జెక్టీవ్ రెండు రకాల ప్రశ్నలు ఉండటంతో విద్యార్థులు విషయాన్ని ఎంతవరకు అవగాహన చేసుకున్నారనే విషయం తెలుస్తుందని తెలిపారు. ఐదో తరగతి వరకు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు వచ్చేలా సులువుగా బోధనలు ఉంటాయని వెల్లడించారు. ఆరో తరగతి నుంచి సబ్జెక్టులతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, కోడింగ్, ఎలక్ట్రానిక్స్, వడ్రంగి వంటి వృత్తి శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఏ రంగంలో రాణించాలనేది విద్యార్థి అభిరుచిని బట్టి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు సర్దార్‌భాషా, బ్రహ్మయ్య, సూర్యకుమారి, సవిత రాణి పాల్గొన్నారు.

దంచింది.. ముంచింది

● జోరు వానతో పోటెత్తిన వరద ● ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు ● పలు చోట్ల రాకపోకలు బంద్

అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన నంబర్లు

కలెక్టరేట్ 7995070699
రామగుండం 9603666444
పెద్దపల్లి 9988556162
మంథని 9859318318, 9059059023
సుల్తానాబాద్ 9502671405, 9849171306
పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బంది 8712699138, 9553015785, 9866754883
మంథని అగ్నిమాపక సిబ్బంది 8712699205, 9550763455
గోదావరిఖని అగ్నిమాపక సిబ్బంది 871269907, 9849112752

కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లి వద్ద మానేరు, హుస్సేన్‌మియా వాగు ప్రవాహం





సుల్తానాబాద్: పూసాలలో నీటిలో పొలాలు



కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో..



ఎలిగేడు: నారాయణపల్లిలో ఇళ్లలోకి..



ఎలిగేడు మండలం ధూళికట్ట ఊరచెరువు..

జిల్లాలో వర్షపాతం వివరాలు (మి.మీలో)

ఎలిగేడు	సుల్తానాబాద్	ధర్మారం	ఓదెల	శ్రీరాంపూర్	అంతర్గాం	రామగుండం	ముత్తారం	పాలకుర్తి	జూలపల్లి
175	165.1	158.5	152.1	143	138	135.1	129.6	113.8	109.3

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో జడివాన దంచికొట్టింది. దీంతోదారులన్నీ ఏరులయ్యాయి. వాగులు, నాలాలు ఉప్పొంగి ప్రవహించాయి. గోదావరి, మానేరుకు వరద పోటెత్తింది. కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద ముంచెత్తింది. వరణుడు బుధవారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురవటంతో పలు మండలాల్లో కాలనీలు, ప్రధాన రహదారులు జలదిగ్బంధం కావటంతో జనం నరకయాతన పడ్డారు. జనజీవనం స్తంభించిపోయింది. ఎలిగేడులో అత్యధికంగా 17.5 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. జిల్లాలో వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. మంథని మండలం గోపాల్‌పూర్‌లోని ఇసుక క్వారీలో చిక్కుకుపోయిన 19మందిని సుమారు ఏడు గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ చేసి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రెస్క్యూ చేసిన డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌ను డీజీపీ ట్విటర్ ద్వారా అభినందించారు. జిల్లావ్యాప్తంగా 122 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. వరద బాధితుల కోసం ధర్మారం, నందిమేడారం, రామగుండం, మంథనిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ముంపులోనే కాలనీలు

బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షం చాలా ప్రాంతాలపై ప్రభావం చూపింది. సుల్తానాబాద్‌లో బస్టాండ్ రోడ్డు, సుగ్లాంపల్లి, పుసాలా, స్వప్నకాలనీలు జలమయమయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ మండలకేంద్రంలోని శివాలయం, ఒడ్డెరకాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరింది. జిల్లాకేంద్రంలోని రంగంపల్లిలో రాజీవ్‌రహదారిపై వరదనీరు చేరటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హుస్సేనిమియా, వాగులు, చెరువులు మత్తడి పోస్తుండటంతో లోలెవల్ వంతెనలు మునిగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ఫలితంగా చాలారూట్లల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. కాజీపేట–బలార్షా సెక్షన్‌ల మధ్య పలు రైళ్లను రద్దు చేయటంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు.

ఎల్లంపల్లికి గంటగంటకూ పెరిగిన ఇన్‌ఫ్లో

ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిమట్టం గంటగంటలకూ పెరిగిపోయింది. ఉదయం ఐదు గంటలకు 20గేట్లు ఎత్తి 1.39 లక్షల క్యూసెక్కులు దిగువకు వదిలారు. గంటగంటకూ ఇన్‌ఫ్లో పెరుగుతూ పోవడంతో అధికారులు అంతే మొత్తంలో గేట్లను ఎత్తారు. అలాగే ఎల్లంపల్లికి దిగువన ఉన్న పార్వతీ, సరస్వతీ బ్యారేజీల్లో సైతం గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని వదిలారు. దీంతో గోదావరిఖని, మంథనిలోని తీరప్రాంతవాసులకు బ్యాక్‌వాటర్‌తో ముంపు తప్పినట్లయింది. ఉదయం 1.93 లక్షల క్యూసెక్కుల వరద రాగా, సాయంత్రానికి అది 7.32లక్షల క్యూసెక్కులకు చేరింది. సాయంత్రం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 40గేట్లు ఎత్తి 7.09లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీరాంసాగర్ గేట్లు ఎత్తడంతో గోదారిలో, కరీంనగర్‌లోని ఎల్ఎండీ డ్యాం గేట్లు ఎత్తటంతో మానేరులో నీటి ప్రవాహం పెరగింది. ఈ పరీవాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాల్సిందే..

జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలతో చెరువులు, వాగులు పొంగుతుండడం.. మరో రెండురోజులు భారీ వర్షసూచన ఉండటంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగం సూచిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 79950 70699 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ బల్దియాల్లోనూ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవో, ఇంజనీరింగ్, వ్యవసాయ, అనుబంధ అధికారులను సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేశారు.

ముంపు ప్రాంతాలపై దృష్టిసారించాలి

పెద్దపల్లిరూరల్: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు, ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ఎల్లంపల్లి, పార్వతి బ్యారేజీలకు భారీగా వరద వస్తోందని, గత అనుభవాల నేపథ్యంలో ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను తరలించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాల్లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాం ప్రసాద్‌లాల్ పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పర్యటించిన శ్రీధర్‌బాబు



మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని లైన్ గడ్డ, అడవిసోమన్ పల్లి గ్రామాలను ఎమ్మెల్యే డి.శ్రీధర్ బాబు గురువారం రాత్రి సందర్శించారు. లోతట్టు ప్రాంతామైన లైన్‌గడ్డ ఇతర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతేడాది వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు సూచించారు.

గోదావరి ఉధృతిని పరిశీలించిన కోరుకంటి



గోదావరిఖని: ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఉరకలేస్తున్న గోదావరి ప్రవాహాన్ని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. నగర మేయర్ అనిల్‌కుమార్ తదితరులున్నారు.

వరద ఉధృతి పెరిగే అవకాశం



మంథని: గోదావరి, మానేరు నదుల ప్రవాహంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సూచించారు. అధికారులతో కలిసి గురువారం గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఎస్సారెస్పీ, కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యాం గేట్లు ఎత్తడంతో గోదావరి, మానేరుకు భారీ వరద వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు.

మంథని మాతాశిశు సంరక్షణ కేంద్రం ఖాళీ



మంథని: వర్షాల నేపథ్యంలో వైద్య అధికారులు అప్రమత్తమయ్యారు. మాతాశిశు ఆస్పత్రిలో ఉన్న బాలింతలు, గర్భిణులు ఆరుగురిని పెద్దపల్లి మాతాశిశు ఆస్పత్రికి తరలించారు. మరికొందరు మహిళలను సామాజిక వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలోని సామగ్రిని సురక్షిత ప్రదేశంలో ఉంచారు. ప్రసూతి, గర్భిణలకు అత్యవసర సేవలు సామాజిక వైద్యశాలలో అందిస్తామని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సబ్బితం జలపాతం వైపు రావొద్దు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం శివారు గౌరీగుండాల జలపాతం సందర్శనకు పర్యాటకులు రావొద్దని బసంత్ నగర్ ఎస్సై వెంకటేష్ కోరారు. సబ్బితం నుంచి జలపాతం వెళ్లే ప్రధాన రహదారి వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆనందం కోసం వచ్చి యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పునరావాస కేంద్రానికి తరలింపు



కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటకు చెందిన పలువురిని అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. గ్రామ శివారులోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో 30మంది బాధితులను గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు.

మహిళను కాపాడిన రాజ్‌ఠాగూర్



గోదావరిఖని: జనగామలోని లోతట్టు ప్రాంతంలో నివాసముంటున్న ఓ నిరుపేదను కాపాడారు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్. ఆర్జీ–1 జీఎంతో మాట్లాడి ఇంట్లోకి వరదనీరు రాకుండా మట్టి పోయిస్తానని హామీ ఇచ్చారు.

చామనపల్లిని చుట్టుముట్టిన మేడారం రిజర్వాయర్ నీరు



ధర్మారం: బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి మేడారం రిజర్వాయర్‌లో వరదనీరు చేరింది. చామనపల్లిని చుట్టుముట్టింది. అప్రమత్తమైన తహసీల్దార్ కేవై.ప్రసాద్, ఎంపీడీవో జయశీల పరిస్థితిని అధికారులకు సమాచారం అందించగా మేడారం రిజర్వాయర్ వద్ద గల రెండు ఎల్లంపల్లి మోటార్లను ఆన్ చేసి గంగధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి తరలించారు. దీంతో మధ్యాహ్నం వరకు నీరు తగ్గుముఖం పట్టింది. ముందుగా గ్రామంలోకి నీరు రాగానే అధికారులు సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించి ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వినోద్ పర్యవేక్షించారు. మేడారం రిజర్వాయర్ కట్ట కిందభాగంలోని తెనుగుపల్లెకు వస్తున్న వరదనీటిని రెండు మోటార్లతో రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేయిస్తున్నారు. కొత్తూరు, కటికెనపల్లి, పత్తిపాక, నర్సింగపూర్, రచ్చపల్లి, రామయ్యపల్లి గ్రామాల్లో కాజ్‌వేలపై నుంచి వరదనీరు ప్రవహించటంతో సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

చెరువును పరిశీలించిన డీపీవో



పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి పెద్దచెరువును డీపీవో చంద్రమౌళి పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో చెరువు మత్తడి దూకుతోంది. చెరువు కట్ట కొంత కుంగిన నేపథ్యంలో పరిశీలించి ప్రజాప్రతినిధులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వరద బాధితులకు అండగా మక్కాన్‌సింగ్



ఆటోనగర్‌వాసులతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: వరద ముంపు ప్రాంతాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ గురువారం పర్యటించారు. కార్పొరేషన్ 23వ డివిజన్‌లో చాలామంది పేదలు, వలసకూలీలే అధికంగా నివాసముంటున్నారు. భారీ వర్షాలతో జెన్‌కో బూడిద చెరువు నుంచి ఇన్‌ఫిల్టరేషన్ బావి పగిలిపోయి నీరంతా ఆటోనగర్, మోమీన్‌నగర్, సుభాష్‌నగర్‌ను చుట్టుముట్టింది. సుమారు 200 ఇళ్లలోకి వరద చేరింది. ఆయా కాలనీల్లోని బాధితులకు భోజనం ఏర్పాట్లు చేసిన మక్కాన్‌సింగ్.. వారి పరిస్థితిని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముంపు ప్రజలకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బాధ్యత మరిచి పట్టించుకోకుండా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఆయనకు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే సహాయ నిధి నుంచి తక్షణమే బాధితులను ఆదుకోవాలన్నారు. ఇళ్లు కూలిపోయిన బాధితులకు డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాలనీల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్: భారీ వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. భారీ వర్షాల దృష్ట్యా ఆయన సుల్తానాబాద్‌లో పర్యటించారు. పట్టణంలోని స్వప్నకాలనీ, పూసాల రోడ్డు, రాజీవ్ రహదారిపై వరద ప్రవాహాన్ని పరిశీలించారు. స్వప్నకాలనీలో వైద్యబృందాలను ఏర్పాటు చేయించారు. ఇళ్లవద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని కలెక్టర్ సూచించారు. జలమయమైన పూసాల రోడ్డును పరిశీలించి జేసీబీ సహాయంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని ఆదేశించారు. ఇళ్లు, ఆయిల్‌మిల్లులో నీరు చేరడాన్ని పరిశీలించారు. సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, సుల్తానాబాద్ తహసీల్దార్ యాకన్న, మేనేజర్ అలీముద్దీన్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గణపతి, కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, ముత్యం రమేశ్, బాపూరావు, గొట్టం మహేశ్, పల్లా సురేష్ ఉన్నారు.



సుల్తానాబాద్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కలెక్టర్‌కు ప్రజల వినతి

పూసలలో ఏటా ఇళ్లలోకి వరద చేరుతోందని, చర్యలు తీసుకోవాలని ప్రజలు కలెక్టర్‌ను కోరారు. వరదలు తగ్గాక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

కేకే నగర్‌లోకి వరద నీరు


ఇంటిముందు నిలిచిన వరదనీరు

యైటింక్లయిన్ కాలనీ : భారీ వర్షాలతో సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకే నగర్‌లోని లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి గురువారం వరద నీరు చేరింది. డ్రైనేజీ కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో వరద నీరు ఇళ్లల్లోకి వస్తుందని కేకే నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు. వర్షాకాలంలో ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుందని, వెంటనే గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని వారు కోరుతున్నారు.

నిలిచిన రాకపోకలు

మంథని: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో మంథని డివిజన్ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పలుచోట్ల రోడ్లపై వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా మంథని- కాటారం, తాడిచర్ల వైపు రహదారులపై నుంచి వరద ప్రహిహిస్తోంది. దీంతో అటు వైపు రవాణా నిలిచిపోయింది. గోపాల్‌పూర్, చిన్న ఓదాల, నాగేపల్లి, అడవి సోమన్‌పల్లి, వెంకటాపూర్‌తో పాటు ఇతర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నిలిపివేసింది. దీంతో వివిధ పనుల నిమిత్తం మంథనికి వచ్చిన వారంతా అక్కడే ఆగిపోయారు. చాలా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పల్లెలు అంధకారంలో మగ్గుతున్నాయి.

అదృశ్యమై ఆపై శవమై..

గోదావరిఖని: ఈనెల 22న అడ్డగుంటపల్లెకు చెందిన టేకు బక్కమ్మ (70) ఇంట్లోంచి వెళ్లి అదృశ్యం కాగా గురువారం డ్రైనేజీలో మృతదేహం లభ్యమైంది. గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం … బక్కమ్మ వారం రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లగా సప్తగిరికాలనీ సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద డ్రైనేజీలో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జల దిగ్బంధంలో గ్రామాలు

- ఇళ్లలోకి చేరిన వరదనీరు
- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు
- బిక్కుబిక్కుమంటున్న పరీవాహక పల్లెలు
- నీట మునిగిన పంట పొలాలు


బొక్కల వాగు ప్రవాహం


మంథని వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

మంథని: గోదావరి, మానేరు ఉగ్రరూపం దాల్చడంతో మంథని డివిజన్‌లోని పరీవాహక ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలోని సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీలో 70 గేట్లు ఎత్తి 5,34,200 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తుండటంతో మంథని వద్ద గోదావరి స్నానఘట్టాలు, శ్రాద్ధమండపం, శ్మశాన వాటిక దాటి నీరు ప్రవహిస్తోంది. దీంతో గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి నీరు చేరింది. మానేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండంటంతో మండలంలోని చిన్న ఓదాల, గోపాల్‌పూర్, నాగేపల్లి, అడవి సోమన్‌పల్లి గ్రామాల్లోకి ఇళ్లలోకి వరదనీరు చేరింది. చిన్న ఓదాల ప్రధాన రోడ్డుపై నుంచి వరద ప్రవహించడంతో సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్నారు. ఐదు కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. నాగేపల్లిలో సైతం మూడు కుటుంబాలను తరలించారు. అడవి సోమన్‌పల్లిలో 15 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

రాకపోకలు బంద్..

మానేరు, గోదావరి ఉధృతితో మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గోపాల్‌పూర్, చిన్నఓదాల, నాగేపల్లి, వెంకటాపూర్, ఆరెంద, పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నిలిపివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మల్లేపల్లిలో రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో రాకపోకలు స్తంభించాయి. గ్రామపంచాయతీ సిబ్బంది చెట్లను తొలగించారు.

పంట పొలాల మీదుగా వరద

మానేరు బొక్కలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సమీపంలోని వందలాది ఎకరాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. దీంతో పంటపొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వారం క్రితమే నాట్లు వేయడంతో ఆనవాళ్లు కోల్పోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


సోమన్‌పల్లిలో వరదనీరు


సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న నాగేపల్లి వాసులు


సోమన్‌పల్లి వద్ద వంతెనకు సమీపంలో ప్రవహిస్తున్న మానేరు

శ్రీ గంధం చెట్టు నరికివేత?

పాలకుర్తి : బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారం స్టాఫ్ కాలనీ డైరెక్టర్ బిల్డింగ్ ప్రాంగణంలోని శ్రీగంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికి దుంగలు ఎత్తుకెళ్లారు. జీడీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కేశోరాం కంపెనీ గోడపై ఉన్న సోలార్ ఫెన్సింగ్‌ను కట్ చేసి లోపలికి చొరబడ్డారు. డైరెక్టర్ బిల్డింగ్ సమీపంలోని శ్రీగంధం చెట్టును నరికి దుంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. గతంలోనూ మూడుసార్లు శ్రీ గంధం దుంగలను ఎత్తుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి. గతేడాది స్టాఫ్‌కాలనీలో మూడిళ్లలో చోరీకి పాల్పడి భారీగా బంగారం ఎత్తుకెళ్లినా ఇప్పటివరకు వారిని పట్టుకోలేదు. కంపెనీ అధికారులు నివాసముండే స్టాఫ్‌కాలనీ చుట్టూ ప్రహరీ, సెక్యూరిటీ సిబ్బంది గస్తీ నిర్వహించినా శ్రీగంధం దుంగలను చోరీ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కంపెనీ సెక్యూరిటీ విభాగం వైఫల్యంతోనే తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఎస్సై వెంకటేశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఫోన్ ద్వారా విషయం తెలిపినట్లు చెప్పారు.

రైలు ప్రయాణంలో తకరారు

- బల్లార్ష–ఖాజీపేట సెక్షన్‌లో రైళ్లు రద్దు
- వరంగల్ వరకే తిరుపతి–కరీంనగర్ రైలు
- కొన్ని దారి మళ్లింపు, ఇంకొన్ని పాక్షికంగా రద్దు
- ప్రయాణికుల ఇబ్బందులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. కొన్నింటిని అధికారులు పాక్షికంగా రద్దు చేయగా, ఇంకొన్నింటిని దారి మళ్లించారు. ఈ ఆకస్మిక పరిణామంతో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రద్దు, పాక్షిక రద్దు, దారి మళ్లిన రైళ్ల వివరాలిలా ఉన్నాయి..

- సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ గురు, శుక్రవారాల్లో రద్దయ్యాయి.
- సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గురువారం రద్దవగా శుక్రవారం ఉదయం కూడా రద్దు చేశారు.
- సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఘన్‌పూర్–సికింద్రాబాద్ మధ్య నడుపుతున్నారు. ఘన్‌పూర్–కాగజ్‌నగర్ వరకు రద్దు చేశారు. ఈ మూడు రైళ్ల వల్ల నిత్యం హైదరాబాద్ వెళ్లాల్సిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- తిరుపతి–కరీంనగర్ బైవీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్‌కే పరిమితం చేశారు. వరంగల్–కరీంనగర్ మధ్య తాత్కాలికంగా రద్దు చేశారు. పిల్లాపాపలతో తిరుమల దర్శనానికి వెళ్లిన వారంతా లగేజీతో వర్షంలో తడుస్తూ తిరిగి బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.
- సికింద్రాబాద్–పాట్నా వెళ్లే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ పెద్దపల్లి, రామగుండం నుంచి వెళ్లాల్సి ఉండగా విజయవాడ మీదుగా దారి మళ్లించారు.
- చెన్నై–అహ్మదాబాద్ వెళ్లాల్సిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లి, మంచిర్యాల కాకుండా వాడి –సికింద్రాబాద్ మీదుగా మళ్లించారు.
- న్యూఢిల్లీ–హైదరాబాద్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను బల్లార్షా–ఆదిలాబాద్–ముత్కేడ్ జంక్షన్ మీదుగా నిజామాబాద్ నుంచి దారి మళ్లించారు.
- గోరఖ్‌పూర్–సికింద్రాబాద్ రైలును పెద్దపల్లి–కరీంనగర్– నిజామాబాద్ మీదుగా దారి మళ్లించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

- ఆర్జీ–2 జీఎం మనోహర్


వరద ఉధృతిని పరిశీలిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని: వాగులో వరదనీటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్జీ–2 జీఎం మనోహర్ పేర్కొన్నారు. ఓసీపీ–3 ప్రాజెక్టును అనుకుని ప్రవహిస్తున్న జల్లారం వాగులో వరద ఉధృతిని జీఎం గురువారం పరిశీలించారు. భారీ వర్షాలతో నదులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయని, జల్లారం వాగుద్వారా వరద ఉధృతిని అంచనా వేసేందుకు గమనించాలన్నారు. క్వారీలోకి వర్షపు నీరు వెళ్లకుండా నాలాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ప్రమాద హెచ్చరికలను చూడాలన్నారు. వ్యూ పాయింట్ ద్వారా ఓసీపీ–3 పని స్థలాలు కాంట్రాక్టు ఓబీ పని స్థలాలను పరిశీలించారు. క్వారీలో నీటిని పరిశీలించి పంప్ సెక్షన్ ఉద్యోగులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. జీఎం వెంట ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి మధుసూదన్, మేనేజర్ రమేశ్, సర్వే అధికారి నరసింగారావు ఉన్నారు.

వరద ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని: వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కార్మికవాడలకు తాగునీరు సరఫరా అయ్యే గోదావరినది ఇంటెక్‌వెల్‌ను గురువారం సందర్శించారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరినదిలోకి వస్తోన్న వరద నీటిని ఆయన పరిశీలించారు. నీటి లెవల్ ఇండికేటర్ వద్ద తనిఖీ చేసి ఇన్‌టెక్‌వెల్ వద్ద పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. గోదావరినది నుంచి సింగరేణి కాలనీలకు సరఫరా అయ్యే తాగునీటిపై చర్చించారు. అనంతరం మేడిపల్లి ఓసీపీ వద్ద ఉన్న ఎంసాండ్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఏజెంట్ బానోతు సైదులు, ఏజీఎం సివిల్ నవీన్, మేనేజర్ రమేశ్ బాబు, సర్వే అధికారి ప్రభాకర్, డీవైఎస్ఈ వసంత్‌కుమార్, యాదవ్ తదితరులున్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–1 పర్సనల్ అధికారిగా పనిచేసి కార్పొరేట్ పర్సనల్ వింగ్‌కు బదిలీపై వెళ్తున్న కందగట్ల శ్రీనివాస్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీ నారాయణ, సీనియర్ పీవో సారంగపాణి, శ్రావణ్‌కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ దేవాచారి పాల్గొన్నారు.

కూలిన ఇళ్లు..


నిత్యావసరాలు అందజేస్తున్న మక్కాన్‌సింగ్


కుక్కల గూడూర్‌లో కూలిన ఇంటి పైకప్పు

రామగుండం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన హోటల్ చిరు వ్యాపారి ఎండీ.యూసుఫ్ ఇల్లు కూలిపోయింది. గురువారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా కల్పించారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ.తాజ్, జబ్బార్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను డీసీసీ అధ్యక్షుడు ఠాకూర్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఇక్కడ పార్టీ ప్రతినిధులు, తదితరులున్నారు.

కొమిరలో..

ఓదెల: ఓదెల మండలం కొమిర గ్రామంలో నాగపూరి కిట్టమ్మ అనే వృద్ధురాలి ఇల్లు కూలడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. కిట్టమ్మ కేకలు వేయటంతో ఇంటిపక్కన వారు ఆమెను బయటకు తీసుకొచ్చారు. తహసీల్దార్ రమేశ్ పరిశీలించి వృద్ధురాలిని పరామర్శించారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రాణాపూర్‌కు చెందిన గొట్టె మల్లమ్మ, నల్లాల బుచ్చయ్య, గుడిపల్లి గ్రామానికి చెందిన ద్రాక్షపల్లి భూమయ్య, కన్నాలలో ఎలిగేటి పద్మ, కుక్కలగూడూర్‌లో మాచర్ల ఎల్లమ్మ, జయ్యారంలో కొమురమ్మకు చెందిన ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.


కొమిరలో కూలిన రేకుల షెడ్డు

ఎంపీవో షబ్బీర్ పాషా కూలిన ఇళ్లను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. రాణాపూర్, కన్నాల గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు భారీగా ప్రవహిస్తుండటంతో బసంత్‌నగర్ పోలీసులు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. మారేడుపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డు వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలోని ఇళ్లలోకి వరదనీరు చేరింది. కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని రజ్వీకాలనీలోకి వరదనీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పోలీస్ సర్కిల్ పరిధిలోని కొత్తూరులో జరిగిన హత్యకేసులో ముగ్గురు నిందితులను 24గంటల్లోపు అరెస్ట్ చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. సీఐ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. ధర్మారం మండలం కొత్తూరుకు చెందిన గాలిపెల్లి అశోక్ 2018లో గల్ఫ్‌కు బతుకుదెరువుకోసం వెళ్లి అక్కడ సంపాదించిన డబ్బును సోదరుడు నరేశ్‌కు పంపించాడు. గతేడాది సొంతూరికి వచ్చిన అశోక్ తాను పంపిన డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి పెంచి నరేశ్ మెకానిక్ షాప్‌కు తాళం వేశాడు. దీంతో అశోక్‌ను చంపితే డబ్బుల గొడవ ఉండదని భావించిన నరేశ్, బావ అనిల్, చెల్లె పుష్పలత ప్రణాళిక రచించారు. బుధవారం వేకువజామున అశోక్ నిద్రిస్తున్న సమయంలో తలుపు గడియపెట్టి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ధర్మారం పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. 24గంటల్లోపే నిందితులను పట్టుకున్న సీఐ అనిల్‌కుమార్, ఎస్సై సత్యనారాయణ, సిబ్బందిని ఏసీపీ మహేశ్ అభినందించారు.

కార్మికులకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం

కమాన్‌పూర్: ఆర్జీ–3 డివిజన్ పరిధిలో బొగ్గు ఉత్పత్తిపైనే దృష్టిసారిస్తున్న సింగరేణి యాజమాన్యం కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీ–3 డివిజన్‌లోని ఏఎల్‌పీ గనికి వెళ్లే దారిలో ఉన్న బొక్కల వాగు వర్షాలకు ఉధృతంగా ప్రహిస్తుండంతో కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని స్టీల్ వంతెనపై నుంచి విధులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రెండ్రోజుల క్రితం గనిలో జరిగిన ప్రమాదంలో ఎంజేడబ్ల్యూ కార్మికుడు తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ వాగుదాటి రాకపోవడంతో వైద్యం అందక మృతిచెందినట్లు తెలిపారు. ఏఎల్‌పీ గని నుంచి నలుగురు డైరెక్టర్ల హోదాల్లో ఉన్న కార్మికులకు సరైన రక్షణ చర్యలు కల్పించడం లేదన్నారు. ప్రత్యేక చొరవ చూపి ప్రమాదాలబారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

కూలిన పీపుల్స్‌వార్ శంకరన్న ఇల్లు


కూలిన శంకరన్న నివాసం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అప్పటి పీపుల్స్‌వార్ కార్యదర్శిగా పనిచేసిన దొంత మార్కండేయ ఉరఫ్ శంకరన్న ఇల్లు గురువారం కూలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శంకరన్న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో 1993 జనవరి 25న రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ఈ మధ్యనే శంకరన్న పాత్రతో కూడిన విరాటపర్వం సినిమా తెరకెక్కించారు. శంకరన్న పాత్రలో దగ్గుబాటి రాణా హీరో పాత్ర పోషించారు.మూడు దశాబ్దాల క్రితం ఉద్యమానికి ఆకర్షితుడై పార్టీలోచేరి ఉత్తర తెలంగాణ కార్యదర్శి స్థాయిలో ఎన్‌కౌంటర్‌కు గురయ్యాడు. ఆయన జ్ఞాపకంగా ఉన్న ఒక్క ఇల్లు కూలిపోవడంపై గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

సన్మానం


అధికారులను సన్మానిస్తున్న జీఎం, తదితరులు

కమాన్‌పూర్: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తూ ఈనెల 30న పదవి విరమణ పొందనున్న ఎల్.వీ. గణపతిరావు జనరల్ మేనేజర్ ఈ అండ్‌ఎం (సెంట్రల్ వర్క్ షాపు), సి.స్వామినాయుడు జనరల్ మేనేజర్ ఈఅండ్‌ఎం(సీహెచ్‌పీలు), జీ.సూర్యకుమార్ జనరల్ మేనేజర్ ఈఅండ్‌ఎం(ఎస్‌వోటూ డైరెక్టర్ ఆఫీస్)లను గురువారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఏ జీఎం .కే.వెంకటేశ్వర్లు, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం ఎన్.రాధాకృష్ణ, అధికారులు ఎలిషా, రఘుపతి, రాజేందర్, రమేశ్, జైన్‌ల్లా బద్దీన్, చంద్రశేఖర్, కాశీ విశ్వేశ్వరరావు, శ్రీనివాస్, నాగరాజు, సుధాకర్, నాగేశ్వరరావు, రాజేశ్వరి, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చందర్



గోదావరిఖని: ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో కలిసి మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం కార్పొరేషన్‌కు త్వరగా నిధులు మంజూరు చేసేలా చూడాలని కోరారు.

సహాయక చర్యలు చేపట్టాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని: భారీ వర్షాలతో వరద ఉధృతి పెరుగుతుండటంతో సహాయక చర్యలు చేపట్టాలని సింగరేణి ప్రాజెక్ట్ అండ్‌ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశించారు. గురువారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఏరియాల వారీగా చేపట్టాల్సిన జాగ్రత్తలను సూచించారు. నదులు, వాగులు, గనుల చుట్టూ ఉన్న లోతట్టు ప్రాంతాల్లో వరదనీటిపై అడిగి తెలుసుకున్నారు. ఓసీపీల్లో వర్షపు నీటి పంపింగ్, ఓసీపీ ఓబీ బెంచ్‌లలో పగుళ్లు, పాత క్వారీలు, ఆనకట్టలు, కాలువలు, కట్టలు, కల్వర్టుల గురించి ఆరాతీశారు. లోతట్టు ప్రాంతాల్లో మాక్ రిహార్సల్స్ నిర్వహించాలని, గనుల పరిసరాల్లోని ఆనకట్టలు, రిజర్వాయర్లలోకి నీటిమట్టం, ప్రవాహం తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఎస్ఓటూ జీఎం రాంమోహన్, ఏజెంట్లు భానోతు సైదులు, శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియా అధికారులతో..

భారీ వర్షాల నేపథ్యంలో ఆర్జీ–2 జీఎం మనోహర్‌తో సింగరేణి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రస్తుత పరిస్థితులపై ఆరాతీశారు. ప్రాజెక్టు అధికారులు మధుసూదన్, శ్రీనివాస్ రెడ్డి, సేఫ్టీ అధికారి రవీందర్, నర్సింహారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.